క్లుప్తంగా

బీరప్ప ప్రతిష్ఠోత్సవాలు ప్రారంభం



విగ్రహాలను ఊరేగిస్తున్న గ్రామస్తులు

టేక్మాల్(మెదక్): మండలంలోని బొడ్మట్‌పల్లిలో బీరప్పస్వామి విగ్రహప్రతిష్ఠోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా వేద పండితులు బీరప్ప–కామరాతి, అక్క మహంకాళీ దేవతామూర్తులను డోలు వాయిద్యాలతో నృత్యాలు చేస్తూ ఊరేగించారు. అనంతరం దేవతామూర్తులను జలావాసం చేశారు. హోమం, గణపతిపూజ, యాగమంటప ప్రవేశం, వరుణాయనము, మాతృకానంది, కలశస్థాపన, అర్చన, అగ్ని ప్రతిష్ఠ వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

జీతాలు చెల్లించండి

పాపన్నపేట(మెదక్): గ్రామ పంచాయతీ సిబ్బంది జీతాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ మండల కార్యదర్శి ఎల్ .అశోక్ డిమాండ్ చేశారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ ప్రభాకర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రత్యేక అధికారుల వేధింపులు ఆపాలని, కార్మికులందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది మాణిక్యం, పోచయ్య, లక్ష్మయ్య, గోపాల్ ఉన్నారు.

డ్రైనేజీ అస్తవ్యస్తం



రోడ్డు పక్కనే పారుతున్న మురుగునీరు

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల కేంద్రమైన చిలప్‌చెడ్‌లోని ఓ కాలనీలో మురుగు నీరు అస్తవ్యస్తంగా పారుతోంది. మురికి కాల్వ లేకపోవడంతో మురుగు నీరు రోడ్డు పక్కనే ప్రవహిస్తుంది. దీంతో కాలనీవాసులు అనారోగ్యాలకు గురయ్యే అవకాశాలు ఉన్నాయి. స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా మురుగు నీటి గురించి అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరారు.

యువకుడు అదృశ్యం



పవన్ (ఫైల్)

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని జాజితండా పంచాయతీ రామాలయం తండాకు చెందిన యువకుడు అదృశ్యం అయ్యాడు. సోమవారం కౌడిపల్లి ఎస్ఐ రంజిత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. రామాలయం తండాకు చెందిన పాల్యా పవన్(19) ఐటీఐ చదివి ఇంటి వద్ద ఉంటున్నాడు. శనివారం రాత్రి కుటుంబ సభ్యులందరూ కలిసి భోజనం చేసిన తర్వాత పడుకున్నాడు. తెల్లవారుజామున లేచేసరికి కనిపించలేదు. బంధువులు, తెలిసిన వారి వద్ద వెతికినా.. ఆచూకీ లభించలేదు. అతనికి ఫోన్ చేసినా తీయడం లేదన్నారు. ఈ విషయమై తండ్రి పత్యానాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యార్థులకు ప్లేట్ల పంపిణీ



ప్లేట్లు పంపిణీ చేస్తున్న దాతలు

హవేళిఘణాపూర్(మెదక్): మెదక్ మండలంలోని రాజ్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు సోమవారం ఉచితంగా ప్లేట్లు పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన పెద్దోళ్ల పెంటయ్య జ్ఞాపకార్థం వారి పిల్లలు పాఠశాలకు చెందిన 120 మంది విద్యార్థులకు ప్లేట్లు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

ఆలయానికి విరాళం

నర్సాపూర్: మండలంలోని రెడ్డిపల్లిలో నిర్మిస్తున్న మార్కండేయ ఆలయానికి నర్సాపూర్‌కు చెందిన కంది బబిత, ప్రభాకర్‌రావు దంపతులు రూ.51వేల 111 విరాళాన్ని ఆలయ నిర్మాణ ప్రతినిధులకు అందజేశారు. ఆలయ నిర్మాణానికి విరాళం అందజేసిన దాతలను ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు.

అయోధ్యకు సైకిల్ యాత్ర

పెద్దశంకరంపేట(మెదక్): అయోధ్యకు పెద్దశంకరంపేటకు చెందిన బలగం భానుచందర్‌గౌడ్ సోమవారం రామాలయం నుంచి సైకిల్ యాత్రగా తరలివెళ్లాడు. అయోధ్యలోని శ్రీరాముడికి అరకిలో వెండితో తయారుచేసిన ధనుస్సు సమర్పించడానికి వెళ్తున్నట్లు ఆయన్ను ప్రజాప్రతినిధులు అభినందించారు.

ఖాళీ కుర్చీలే దర్శనం

- 11గంటలు తర్వాతే విధులకు హాజరు
- సిబ్బంది ఇష్టారాజ్యం
- అధికారుల పర్యవేక్షణ కరువు

సాక్షి విజిట్



11 గంటలకు ఖాళీగా అల్లాదుర్గం తహసీల్దార్ కార్యాలయం

అల్లాదుర్గం(మెదక్): అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ప్రభుత్వ కార్యాలయాలు అస్తవ్యస్తంగా మారుతున్నాయి. ఉదయం 10 గంటలకు రావాల్సిన అధికారులు, సిబ్బంది ఇష్టరాజ్యంగా విధులకు హాజరవుతున్నారు. 11 గంటలు దాటితే తప్ప ఎవరు కార్యాలయంలో అడుగు పెట్టడం లేదు. సోమవారం 'సాక్షి' అల్లాదుర్గంలోని పలు కార్యాలయాలను విజిట్ చేయగా వెలుగులోకి వచ్చింది.

అల్లాదుర్గం తహసీల్దార్ కార్యాలయానికి 11 గంటలు దాటిన తర్వాతే అధికారులు, సిబ్బంది విధులకు హాజరయ్యారు. కార్యాలయంలో తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, ఇద్దరు ఆర్ఐలు, అటెండర్లు 2, జూనియర్ అసిస్టెంట్‌లు 3, రికార్డు అసిస్టెంట్‌లు 2, కంప్యూటర్ ఆపరేటర్ 1, ధరణి ఆపరేటర్ 1, సర్వేయర్ 1, ఎఎస్ఓ 1 ఇంత మంది సిబ్బంది ఉన్నారు. ఇందులో డిప్యూటీ తహసీల్దార్, ఆర్ఐలు 11 గంటలకు రాగా, తర్వాత ఇతర సిబ్బంది ఒక్కొక్కరు హాజరయ్యారు. ధరణి ఆపరేటర్ 12 గంటలు దాటినా హాజరు కాలేదు. తహసీల్దార్ ప్రత్యేక అధికారిగా అదనపు బాధ్యతలు చేపట్టడంతో కేటాయించిన గ్రామాలకు వెళ్లి రావడంతో 12 గంటలకు కార్యాలయానికి చేరుకున్నారు. భూముల రిజిస్టర్ కోసం వచ్చిన వారు, సమస్యల పరిష్కారానికి వచ్చిన రైతులు అధికారుల కోసం కార్యాలయం వద్ద పడిగాపులు కాయాల్సిన దుస్థితి నెలకొంది.

పంచాయతీరాజ్ సబ్ డివిజన్ కార్యాలయంలో డీఈఈ, ముగ్గురు సిబ్బంది ఉండగా ఒక్కరే సమయానికి వచ్చారు. ఈ కార్యాలయంలో కొందరు సిబ్బంది పర్సంటేజీలు వచ్చేటప్పుడు రాత్రి వరకు కార్యాలయంలోనే ఉంటున్నారు. ఐసీడీఎస్ కార్యాలయంలో సహితం ఖాళీ కుర్చీలే దర్శనమిచ్చాయి. పరీక్షలు దగ్గర పడుతున్న అల్లాదుర్గం కేజీబీవీ సిబ్బంది సహితం సమయ పాలన పాటించకుండా ఇష్టం వచ్చిన సమయానికి హాజరవుతున్నారనే విమర్శలున్నాయి. కొంత మంది టీచర్లు 11 నుంచి 12 గంటల ప్రాంతంలో విధులకు హాజరు కావడం గమనార్హం. ఇప్పటికైన సంబంధిత శాఖల అధికారులు పర్యవేక్షించి అధికారులు, సిబ్బంది సక్రమంగా విధులకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



పీఆర్ సబ్ డివిజన్ కార్యాలయంలో ఖాళీ కుర్చీలు



12 దాటినా.. హాజరు కాని ధరణి ఆపరేటర్

నీటి సమస్య తలెత్తకుండా చర్యలు



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, అధికారులు

- మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్
- నర్సాపూర్ మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశంలో పలు అంశాలపై ఏకగ్రీవ తీర్మానాలు

నర్సాపూర్ రూరల్: వచ్చే వేసవిలో తాగునీటి సమస్యలు తప్పకుండా చర్యలు తీసుకోవాలని మిషన్ భగీరథ అధికారులకు మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ సూచించారు. సోమవారం నర్సాపూర్ మున్సిపల్ సాధారణ సమావేశం మున్సిపల్ చైర్మన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చే వేసవిలో ఏ ఒక్క వార్డులో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తుగా చర్యలు చేపట్టాలని అధికారులకు తెలిపారు. నర్సాపూర్ పట్టణంలో కోతుల బెడద తీవ్రం కావడంతో వాటి నివారణ కోసం చర్యలు తీసుకోవాలని అటవీ శాఖ ఎఫ్ఆర్ఓ అమర్ సింగ్‌కు సూచించారు. మున్సిపల్ కౌన్సిలర్లు మాట్లాడుతూ..సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలంల్లో నల్లవల్లి అడవి ప్రాంతంలో జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో డంప్‌యార్డ్ నిర్మిస్తున్నట్లు మీడియా ద్వారా తెలిసిందని చెప్పారు. నల్లవల్లిలో డంప్‌యార్డ్ నిర్మిస్తే వ్యర్థాలు, రసాయనాలతో నర్సాపూర్ చెరువుకు వచ్చే వరద నీటితో అడవి ప్రాంతంతో పాటు, నర్సాపూర్ రాయరావు చెరువు నీరు కలుషితం అయ్యే ప్రమాదం ఉందని దాన్ని అడ్డుకోవాలని తీర్మానించారు. మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ దుకాణ సముదాయం గడువు ముగిసినందున దుకాణాలు ఖాళీ చేయించి ఓపెన్ టెండర్ పద్ధతిన పద్ధతిన అద్దెకు ఇవ్వనున్నట్లు తీర్మానించారు. పారిశుద్ధ్య పనులు, వీధిదీపాల ఏర్పాట్లు సక్రమంగా చేపట్టేందుకు చర్చించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్, నయీముద్దీన్, కౌన్సిలర్లు రామచందర్, లలిత, లక్ష్మి, తంగేడి సరిత, రుక్కమ్మ, ఇస్రాత్ సిద్దికి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

పరీక్ష ఫీజు గడువు పెంపు

పాపన్నపేట(మెదక్): ఓపెన్ ఇంటర్, టెన్త్ పరీక్షల ఫీజు ఈ నెల 21 లోగా చెల్లించాలని పాపన్నపేట మండల కోఆర్డినేటర్ మహేశ్వర్, అసిస్టెంట్ కో ఆర్డినేటర్ నరేందర్ తెలిపారు. ఏప్రిల్, మే నెలలో నిర్వహించబోయే టెన్త్, ఇంటర్మీడియట్ పరీక్షలకు సకాలంలో ఫీజు చెల్లించాలని కోరారు. ఒక్కో సబ్జెక్టుకు రూ.100 చొప్పున ఉంటుందని చెప్పారు. ఈ నెల 27 వరకు రూ.25 ఫైన్, మార్చి 4 వరకు రూ.50 ఫైన్‌తో చెల్లించ వచ్చని సూచించారు.

వేంకటేశ్వర ఆలయంలో బ్రహ్మోత్సవాలు

రామాయంపేట(మెదక్): పట్టణంలోని వేంకటేశ్వర ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా సోమవారం యాగశాల ప్రవేశం, మూలమంత్ర హోమం, ధ్వజారోహణం నిర్వహించారు. సూర్యకిరణాల ద్వారా యాగశాలలో హోమంలో అగ్నిజ్వాల వెలిగించారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

గ్రూప్‌-4లో యువతి ప్రతిభ



అంబిక

పెద్దశంకరంపేట(మెదక్): ఇటీవల వెల్లడైన గ్రూప్–4 ఫలితాల్లో పెద్దశంకరంపేటకు చెందిన చకిలం అంబిక ప్రతిభ కనబర్చింది. కామారెడ్డి జిల్లాలో జనరల్ విభాగంలో జిల్లా స్థాయిలో 16వ ర్యాంకు, రాష్ట్ర స్థాయిలో 1,024వ ర్యాంకు సాధించింది. బీటెక్ పూర్తి చేసి గ్రూప్స్‌కు ప్రిపేర్ అవుతుంది. మొదటి ప్రయత్నంలోనే గ్రూప్–4లో జిల్లా స్థాయిలో ర్యాంకు సాధించింది.

రైతులు పంటల వివరాలను నమోదు చేసుకోవాలి

మనోహరాబాద్(తూప్రాన్): రైతులు తాము పండించే పంటలను ఏ సర్వే నంబర్‌ల్లో వేస్తున్నారో, తదితర పూర్తి సాగు, భూమి వివరాలను తప్పకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి స్రవంతి అన్నారు. సోమవారం ఆమె మాట్లాడుతూ.. రైతులు ప్రభుత్వం అందించే పథకాలు అందాలంటే తమ పంటల వివరాలను, సాగు వివరాలను నమోదు చేసుకోవాలని, ఏఈఓలకు తమ వివరాలను తప్పకుండా అందజేయాలని రైతులను కోరారు.

లక్ష్యంతో చదివితే ఏదైనా సాధ్యం

కలెక్టర్ రాజర్షిషా



మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షిషా

నర్సాపూర్ రూరల్: లక్ష్యంతో చదివితే ఏదైనా సాధించవచ్చని జిల్లా కలెక్టర్ రాజర్షిషా విద్యార్థులకు సూచించారు. సోమవారం విష్ణు హైస్కూల్ వార్షికోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరు, మాట్లాడుతూ.. కొన్నిసార్లు అనుకున్న లక్ష్యం నెరవేరకపోవడంతో నిరాశ చెందకూడదన్నారు. తిరిగి ప్రయత్నిస్తే కచ్చితంగా లక్ష్యాన్ని చేరుకుంటారన్నారు. అనంతరం చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాసులు, బీవీఆర్ ఐటీ వైస్ చైర్మన్ రవిచంద్ర, సొసైటీ సెక్రెటరీ విక్రమ్ ఆదిత్య, ప్రిన్సిపాల్ సంజయ్ దుబే, వైపర్ ప్రిన్సిపాల్ రమేశ్, విష్ణు హైస్కూల్ ప్రిన్సిపాల్ జామి పాల్గొన్నారు.

నేటి నుంచి సామ్యతండాలో విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని దేవులపల్లి సామ్యతండాలో నూతనంగా నిర్మించిన జగదాంబమాత, సంత్ సేవాలాల్ మహారాజ్ ఆలయంలో ప్రతిష్ఠోత్సవాలు ఈనెల 13 నుంచి 15 వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు, తండావాసులు సోమవారం తెలిపారు.

పీఆర్టీయూ ఆధ్వర్యంలో ఉచిత ఐటీ సేవలు



ఐటీ సేవలు ప్రారంభిస్తున్న సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ

మెదక్ కలెక్టరేట్: జిల్లాలోని ఉద్యోగ, ఉపాధ్యాయులు పీఆర్టీయూ ఆధ్వర్యంలో అందిస్తున్న ఉచిత ఐటీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకరి కృష్ణ తెలిపారు. సోమవారం మెదక్‌లో ఉద్యోగ ఉపాధ్యాయులకు 2023–24 సంవత్సరపు ఉచిత ఐటీ సేవలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాలుగేళ్ల నుంచి ఫిబ్రవరి నెలలో దాదాపు 20 రోజులు పాటు ఉద్యోగ ఉపాధ్యాయులకు ఉచిత ఐటీ సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. సాయంత్రం 6 నుంచి 8 వరకు మెదక్ పీఆర్టీయూ కార్యాలయంలో ఈ సేవలు ఉంటాయని తెలిపారు. ఉచిత సేవలపై ఏమైనా సందేహాలు ఉంటే 73965 92798, 95532 07616, 94909 30765 నంబర్లను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో మెదక్ మండల ప్రధాన కార్యదర్శి శిరిగేశేఖర్, రాష్ట్ర జిల్లా బాధ్యులు శ్రీనివాస్, ఎల్.మల్లారెడ్డి, రాఘవేందర్, నందారం రఘుబాబు, తదితరులు పాల్గొన్నారు.

సేవలకు గుర్తింపు



అవార్డు అందుకుంటున్న శ్రీనివాస్

వెల్దుర్తి(తూప్రాన్): మండల కేంద్రం వెల్దుర్తి పట్టణానికి చెందిన అయ్యప్పగారి శ్రీనివాస్ రైతులకు అతి తక్కువ ధరలో బోర్‌వెల్ సేవలు అందిస్తున్నాడు. బోరుబావిలో పడిపోయిన మోటార్‌లను తాను స్వయంగా తయారు చేసిన కెమెరా సాయంతో బయటకు తీసి రైతులకు దశాబ్దానికి పైగా సేవలందిస్తున్నాడు. బోర్‌వెల్ రీపేంటింగ్, ఇంజనీరింగ్ వర్క్స్, సామాజిక సేవా కార్యక్రమాలు గుర్తించిన కళానిలయం సాంస్కృతిక సంఘ సేవా సంస్థ సోమవారం హైదరాబాద్‌లో స్వామి వివేకనంద స్ఫూర్తి పురస్కార్ అందజేసింది.

పెన్షన్ డబ్బుల కోసం నిరసన



ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు

శివ్వంపేట(నర్సాపూర్): నెల గడిచిపోయినప్పటికీ నేటికి పెన్షన్ డబ్బులు రాలేదని లబ్ధిదారులు ఎంపీడీఓ కార్యాలయం వద్ద సోమవారం నిరసన వ్యక్తం చేశారు. జనవరి నెల పెన్షన్ డబ్బుల కోసం నిత్యం ఇండియన్ బ్యాంకు వద్దకు వెళ్తున్నా.. ఖాతాలో డబ్బులు జమ కాకపోవడంతో వెనుతిరిగి వెళ్లాల్సి వస్తుందని లబ్ధిదారులు వాపోయారు. దీంతో వారు ఎంపీడీఓ కార్యాలయం సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. అనంతరం కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు.

సోషల్ మీడియా పుకార్లను నమ్మొద్దు

రామాయంపేట ఎస్ఐ రంజిత్

రామాయంపేట(మెదక్): చిన్న పిల్లలను కిడ్నాప్ చేసే ముఠా రామాయంపేటలో తిరుగుతుందని కొందరు సోషల్ మీడియాలో తప్పుడు పుకార్లను నమ్మొద్దని ఎస్ఐ రంజిత్ పేర్కొన్నారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ.. సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేసే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పట్టణంలో అనుమానస్పదంగా ఎవరైనా తిరిగితే తమ దృష్టికి తీసుకరావాలని సూచించారు. ప్రజలు కూడా ఇలాంటి పుకార్లు నమ్మొద్దని, సోషల్ మీడియాలో వస్తున్న వార్తలు పాతవని, వాటిని ట్రోల్ చేస్తున్నారని ఎస్ఐ వివరించారు.

ఘనంగా మార్కండేయ జయంతి వేడుకలు

జిల్లా వ్యాప్తంగా సోమవారం పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో మార్కండేయ పుట్టిన రోజు వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం ఆధ్వర్యంలో అయా గ్రామాల్లో మార్కండేయ చిత్ర పటాల వద్ద పూజలు చేసి నివాళులర్పించారు.



నర్సాపూర్‌లో మార్కండేయ చిత్రపటం వద్ద పూజలు చేస్తున్న పద్మశాలి సంఘం ప్రతినిధులు



శివ్వంపేటలో..



నర్సాపూర్ రూరల్: రెడ్డిపల్లిలో ..

రోడ్డు భద్రత.. అందరి బాధ్యత

తూప్రాన్: జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా మున్సిపల్ పరిధిలో ఒలింపియ ఇంటర్నేషనల్ స్కూల్లో జీఎమ్మార్ వరలక్ష్మి ఫౌండేషన్–పోచంపల్లి ఎక్స్‌ప్రెస్ వేస్ లిమిటెడ్ ఆధ్వర్యంలో సడక్ సురక్ష – జీవన్ రక్ష (రహదారి భద్రత–జీవితానికి రక్షణ) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాసం, పెయింటింగ్, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్ఐ శివానందం, పోచంపల్లి ఎక్స్‌ప్రెస్ వేస్ లిమిటెడ్ ప్రాజెక్ట్ మేనేజర్ వెంకటరమణ ముఖ్య అతిథులుగా విచ్చేసి పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. తూప్రాన్ ఎస్ఐ శివానందం, ప్రాజెక్ట్ మేనేజర్ వెంకటరమణ, పాఠశాల ప్రిన్సిపాల్ రమేశ్‌రావు, ఫౌండేషన్ ప్రతినిధి శ్రీనివాస్, ఒలింపియ ఇంటర్నేషనల్ స్కూల్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వేసవిలో ఇబ్బందులు రాకుండా చూడండి

మనోహరాబాద్(తూప్రాన్): వేసవి కాలం లో గ్రామాల్లో తాగునీటి సమస్య, విద్యుత్ సమస్యలు రాకుండా చూడాలని వైస్ ఎంపీపీ విఠల్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో వైస్ ఎంపీపీ విఠల్‌రెడ్డి అధ్యక్షతన ప్రత్యేక అధికారులు, కార్యదర్శులు, ఎంపీటీసీలతో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. అనంతరం సర్పంచ్‌ను ఎంపీడీఓ యాదగిరిరెడ్డి, వైస్ ఎంపీపీ విఠల్‌రెడ్డి సన్మానించారు. డిప్యూటీ తహసీల్దార్ కౌషిక, వివిధ శాఖల ఏఈలు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **సన్మానం**

కౌడిపల్లి(నర్సాపూర్): కౌడిపల్లి ఎంపీడీఓ శ్రీనివాస్ సంగారెడ్డి జిల్లాకు బదిలీ అయ్యారు. గత ఏడాదిగా ఇక్కడ విధులు నిర్వర్తించి ప్రజల మన్ననలు పొందారు. సోమవారం ఎంపీడీఓ బదిలీ విషయం తెలియడంతో కార్యాలయం అధికారులు, మండల పంచాయతీ కార్యదర్శులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ కలీముల్ల, బలరాం, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

◆ **మండల అభివృద్ధికి నిధులు మంజూరు**

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.కోటి 50 లక్షలు మంజూరు కావడంపై కాంగ్రెస్ నాయకుడు నవీన్‌కుమార్‌గుప్తా హర్షం వ్యక్తం చేశారు.ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా మండల కేంద్రం 20 లక్షలు, గోమారం, దొంతి మేజర్ పంచాయతీలకు 10 లక్షల చొప్పున మిగతా పంచాయతీలకు రూ. 5 లక్షల చొప్పున సీసీ రోడ్డు పనులు నిర్వహించేందుకు నిధులు మంజూరైనట్లు చెప్పారు.

◆ **శివ్వంపేట ఇన్‌చార్జి ఎంపీడీఓగా తిరుపతిరెడ్డి**

శివ్వంపేట(నర్సాపూర్): శివ్వంపేట ఎంపీడీఓ భారతి సంగారెడ్డి జిల్లాకు బదిలీ అయింది. దీంతో సోమవారం సిబ్బంది ఆమెను సన్మానించి వీడ్కోలు పలికారు. ఎంపీఓ తిరుపతిరెడ్డికి ఇన్‌చార్జి ఎంపీడీఓ బాధ్యతలు అప్పగించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ శేఖర్, సీనియర్ అసిస్టెంట్ నరేందర్‌రెడ్డి, సిబ్బంది స్వామి, జీవన్, ఏపీఓ అనీల్‌కుమార్ తదితరులు ఉన్నారు.

◆ **ఫీజుల వసూలుపై ఫిర్యాదు**

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రం చేగుంటలోని సహస్ర ఒకేషనల్ కళాశాలలో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని ఎస్ఎఫ్ఐ నాయకులు డీఐఈఓకు ఫిర్యాదు చేశామన్నారు. ఈ సందర్భంగా అధిక డబ్బులు వసూలు చేస్తున్న కళాశాలపై చర్యలు తీసుకోవాలని జిల్లా సహాయ కార్యదర్శి అజయ్ ఇంటర్ విద్య జిల్లా నోడల్ అధికారికి ఫిర్యాదు చేశారు. మణికంఠ, వరుణ్, సాయితేజ తదితరులు ఉన్నారు.

◆ **ఘనంగా మల్లికార్జునస్వామి జాతర**

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని అల్లీపూర్ గ్రామంలో మల్లికార్జునస్వామి జాతర సోమవారం నిర్వహించారు. భక్తులు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పోతరాజు, అగ్నిగుండాలు, బండ్ల ఊరేగించారు. బీజేపీ నాయకులు మల్లేశ్‌గౌడ్, నిర్వాహకులు, యాదవ సంఘం నాయకులు మల్లేశ్, శ్రీనివాస్ ఉన్నారు.

◆ **మార్కండేయ ఆలయ వార్షికోత్సవం**

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని మానెపల్లి గ్రామంలో మార్కండేయ ఆలయ ఐదో వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో గణపతి హోమం, పుణ్యాహవచనం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకుడు నరేందర్ రెడ్డి, మండలాధ్యక్షుడు మహేశ్‌రెడ్డి, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

◆ **నల్గొండ సభకు భారీగా తరలిరావాలి**

శివ్వంపేట(నర్సాపూర్): బీఆర్ఎస్ ఆధ్వర్యంలో బుధవారం నల్గొండలో నిర్వహిస్తున్న బహిరంగా సభకు మండలం నుంచి బీఆర్ఎస్ శ్రేణులు అధిక సంఖ్యలో తరలిరావాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రమణగౌడ్ అన్నారు.

◆ **ఎమ్మార్పీఎస్ జిల్లా సదస్సుకు తరలిన నాయకులు**

నర్సాపూర్ రూరల్: ఏడుపాయల వనదుర్గ మాత ఆలయం ఆవరణలో సోమవారం జరిగే మెదక్ జిల్లా ఎమ్మార్పీఎస్ జిల్లా సదస్సుకు నర్సాపూర్ మండల ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జి జమునగల్ల కుమార్, ఇతర నాయకులు తరలి వెళ్లారు. వెళ్లిన వారిలో కట్ట భూమయ్య, నాగరాజ్, చెర్లయ్య, దశరథ్, సాయికిరణ్ తదితరులు ఉన్నారు.

◆ **నిధులు మంజూరు**

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని 16 సీసీ రోడ్ల నిర్మాణానికి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం కింద ఒక్కో గ్రామానికి రూ.5లక్షల చొప్పున రూ.80 లక్షలు మంజూరయ్యాయని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మల్లేశంగౌడ్ తెలిపారు. నాయకుడు శేఖర్, మండ ఉపాధ్యక్షుడు గోవర్దన్, ప్రధాన కార్యదర్శి మహేశ్వర్ రెడ్డి, నాయకులు, రంగంపేట గ్రామ అధ్యక్షుడు కృష్ణ, కుమార్‌గౌడ్, వెంకట్ గౌడ్, బాలరాజ్ పాల్గొన్నారు.

◆ **మట్టి అక్రమంగా రవాణా చేస్తే చర్యలు**

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలో అనుమతులు లేకుండా అక్రమ మట్టి రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఎస్ఐ మాట్లాడారు. మండలంలోని జీడిపల్లి శివారులో ఆదివారం అర్ధరాత్రి అక్రమంగా మట్టి రవాణా చేస్తున్న టిప్పర్‌ను పట్టుకొని సీజ్ చేసినట్లు తెలిపారు.